మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ /వనపర్తి / జోగులాంబ గద్వాల /నారాయణపేట



## శక్తివంతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం....

**నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 06 ప్రభాతవార్త:**నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత శక్తి వంతంగా మారిందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో వలసలు జోరుగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. తాడూర్ మండలం సిర్సవాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీ నాయకులు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఊనికి లేకుండా పోయిందని, నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం కనిపించడం లేదని, దీంతో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. నాగర్‌కర్నూల్‌లో ఈ సారి ఎన్నికల్లో మూడోసారి గులాబి జెండా ఎగురడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఊనికి రోజు రోజుకు పడిపోతుందన్నారు. ప్రభుత్వ పనితీరు చూసి పార్టీలో వలసలు పెరిగాయన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందన్నారు. గతంలో కన్న ఈ సారి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతంగా ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన దాదాపు 50వేల మెజార్టీతో నాగంకర్నూల్‌లో గులాభి జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు, విమర్శలు చేసిన ప్రజలు సీఎం కేసీఆర్ వైపు ఉన్నారన్నారు. పార్టీలో చేరిన వారు జలీల్, పరుశరాములు, శ్రీశైలం, నర్సింహ్మ, యాదయ్యతో పాటు పలువురు నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు గౌరికుమార్, యూత్ ఇన్‌చార్జిలు నరేష్, విష్ణు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వ్యక్తి జయశంకర్‌సార్

**నారాయణపేట జిల్లా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు**



**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 06 ప్రభాతవార్త :** తెలంగాణ సిద్ధాంతకర్తగా తొలితరం ఉద్యమకారుడిగా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వ్యక్తి ప్రొ॥ జయశంకర్‌సార్ ఆయనను తెలంగాణ రాష్ట్రం ఎప్పటికిమరిపోదని జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ప్రొ॥ జయశంకర్ 89వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రొ॥ జయశంకర్ సార్ 1969 తొలితరం ఉద్యమంలో, నాన్ ముల్కీ ఉద్యమంలో ఇడ్లీ, సాంబర్ గోబ్యాక్ ఉద్యమంగా చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. తెలంగాణ ప్రజల యాస, భాషా సంస్కృతులు, జీవన విధానంపై పూర్తి అవగాహన ఉన్న జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు వ్రాసి తెలంగాణలోనే కాకుండా దేశంలోని ఇతరప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశారన్నారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఎస్పీసిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ క్రిష్ణయ్య, ఆర్ఎస్ఐ శివశంకర్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌పోలీస్, ఎస్‌బి సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రం సాంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక...

**తీజ్ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి**



**వెల్దండ, ఆగస్టు06 ప్రభాతవార్త:**మన ఆచారవ్యవహారాలు, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండలం ఎంజీకాలనీ తండా, జ్యోతనాయక్ తండాల్లో తీజ్ ఉత్సవాలకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎమ్మెల్సీకి స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. యువతీ, యువకులు గిరిజన నృత్యాలతో అలరించారు. 11రోజులపాటు నిర్వహించిన మొలకలను చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ అనాదిగా వస్తున్న సాంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఇదే విధంగా ప్రతి యేడాది శాంతి యుతంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకొని భక్తి భావాలను చాటాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని పండుగలకు అధిక ప్రాధాన్యత కేటాయిస్తున్నారని, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో అన్నిరంగాల్లో తండాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సంజీవ్ కుమార్‌యాదవ్, జీయాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగ య్యయాదవ్, సర్పంచ్‌లు కుమార్, శంకర్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్ రవినాయక్, ఎంపీటీసీ చిట్టి కాదూరాం, నాయకులు గోళి సురేందర్‌రెడ్డి, కేశమల్ల కృష్ణ, రాజు యాదవ్, తానేష్‌యాదవ్, శ్రీనునాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నూతన జీపీగా ఎవిఆర్ కాలనీ..!!

**సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకాలు**



**భూత్పూర్, ఆగస్టు 06 ప్రభాతవార్త :** పాలమూరు, రంగారెడ్డి కర్వెన రిజర్వాయర్ ప్రాజెక్టు కింద ముంపునకు గురైన భట్టుపల్లి తండా వాసులకు వెల్కిచర్ల గ్రామ సమీపాన నాగర్‌కర్నూల్ రోడ్డున కాలనీ ఏర్పాటు చేసి ప్రభుత్వం వారికి అత్యాధునికంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. తండా వాసులు ఈ కాలనీకి ఎవిఆర్ కాలనీగా నామకరణం చేసి కాలనీలో నివాసముంటున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఈ ఎవిఆర్ కాలనీని గ్రామ పంచాయతీగా గుర్తిస్తూ శనివారం రాత్రి జిఓను జారీ చేయగా ఆదివారం ఎవిఆర్ కాలనీ తండావాసులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబరాలు నిర్వహించారు. సీఎం కెసిఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి చైర్మన్ కదిరె శేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం మానెమోని సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షుడు కొత్తమొల్లర నర్సింహులుగౌడ్, ముడా డైరెక్టర్ మూస సాయిలు, భట్టుపల్లి సర్పంచ్ ఆంజనేయులు నాయక్‌తో పాటు పార్టీ నాయకులు సత్తూరు నారాయణగౌడ్, టి. మురళీధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం యాదయ్య, రామకృష్ణ, ఆకుల వెంకటయ్య, సత్తూర్ అశోక్‌గౌడ్, దశరథ్‌నాయక్, తారునాయక్, పాండునాయక్, జైపాల్ నాయక్, గోపాల్ నాయక్, చాందియనాయక్, భాస్కర్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**కల్వకుర్తి, ఆగస్టు 06, ప్రభాతవార్త:**కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామానికి చెందిన పి.నవ్యకు రూ.20,500లు, తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామానికి చెందిన జీ.మల్లయ్యకు రూ.13వేలు, ఆర్.ప్రశాంతికి రూ.30,500ల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల పాలిటవరమన్నారు. అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారని, సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు. కార్యక్రమంలో మాజీ గోళి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# నాణ్యతలేని అదనపు గదుల నిర్మాణాలు..!

**- నాసిరకమైన ఇసుక, కంకరతో నిర్మాణాలు**

**- నాసిరకమైన పనులకు వత్తాసు పలుకుతున్న అధికారులు**





భవన నిర్మాణ పనులకు స్లాబుకు సన్న రకమైన సీకులను వాడుతున్న దృశ్యం



నాసిరకంగా నిర్మాణ పనులు



నాసిరకంగా ఉన్న కంకర

**వీపనగండ్ల, ఆగసు6, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల పరిధిలోని సంపత్‌రావుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి జడ్పీ నిధుల నుండి 12 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగింది. కానీ అదనపు గదుల నిర్మాణం నాసిరకమైన ఇసుకతో , కంకరతో నిర్మాణాన్ని చేపడుతున్నారని విద్యా కమిటీ చైర్మన్ నాగమోని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో అదనపు భవన నిర్మాణ పనులకు స్లాబుకు సన్న రకమైన సీకును ఉపయోగి స్తున్నారని ఆయన మండిపడ్డారు. కనీసం పనుల వద్ద అధికారుల పర్యవేక్షణ లేదు. కనీస నిబంధనలు పాటించడం లేదు. నాసిరకంగా పనులు చేపడుతున్నారు. సంపత్‌రావుపల్లి పాఠశాలలో చేపడుతున్న పనుల్లో నాణ్యతలోపిస్తుంది. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం కానీ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్న కాంట్రాక్టర్లు అని ఆయన మండిపడ్డారు. అదే విధంగా కొత్త భవనాల నిర్మాణ పనుల్లో కూడా నాణ్యత పాటించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదనపు గదుల భవన నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాసిరకం కంకరతో పాటు సిమెంట్ తక్కువ, ఇసుక ఎక్కువ వినియోగిస్తున్నారని అని విద్యా కమిటీ చైర్మన్ నాగముని ఆరోపించారు. పనులు చాలా వరకు అధికార పార్టీ నాయకులే చేపడుతున్నారు. కాబట్టి ఉన్నతాధికారులు ఎవరుకూడా పర్యవే క్షణచేయడం లేదని విద్యాకమిటీ చైర్మన్ అన్నారు. అదే విధంగా ఏఈ విద్యా సాగర్ పర్యవేక్షణ కూడా అంతంతమాత్రం ఉందని విద్యా కమిటీ చైర్మన్ నాగమణి విమర్శలు గుప్పిస్తున్నారు.



- విద్యా కమిటీ చైర్మన్ నాగముని

# మన్యంకొండలో ఘనంగా తిరుచ్చిసేవ..!



స్వామివారి తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పూజారులు



మన్యంకొండలో స్వామివారిని సేవకోసం తీసుకవస్తున్న సేవపరులు

**దేవరకద్ర, ఆగస్టు 06 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరు చ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతి లో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవ స్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూ దేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవ ను నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామశ్మరణ, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అబిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళీ గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూదేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్య లో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధానపూజారులు రాజేశ్, నర సింహ్మయ్య, పాలక మండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు మద్దతుగా ధర్నా..



మాట్లాడుతున్న కుంభ శివకుమార్‌రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 06 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన గ్రామ పంచాయతీ కార్మికులు సుదీర్ఘ కాలగా వారి సముచితమైన డిమాండ్ల సాధనకై, తమపట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వివక్షతతో కూడిన నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ధర్నా కార్యక్రమం స్థానిక బస్టాండ్ ఆవరణలో నిర్వహిస్తున్నారు. గత 32 రోజుల నుండి వారి న్యాయమైన డిమాండ్ల సాధనకై ఏకరువు పెడుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం చలించకుండా దుష్ట ధృతరాష్ట్ర నిరంకుశ పాలన కొనసాగిస్తూ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్న కెసిఆర్‌ను గద్దె దించితే తప్ప న్యాయం జరగదని ధన్వాడ మండల గ్రామ పంచాయతీ కార్మిక సోదర సోదరీమణులు తలపెట్టిన ఉద్యమానికి నేను సైతం మీ తోనని ఎలాంటి నిరాశ నిస్పృహలకు గురికాకుండా డిమాండ్లు నెరవేరే వరకు విశ్రమించేది లేదని, మడమ తిప్పకుండా పోరాటం చేయాల్సిందేనని జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ బాధ్యులు కుంభం శివకుమార్‌రెడ్డి హాజరై ప్రభుత్వంతో కార్మికులు చేస్తున్న యుద్ధానికి తమపూర్తి మద్దతు తెలియజేస్తూ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ డిమాండ్ల సాధనకై ఉద్యమిస్తున్న కార్మికులకు తనవంతుగా ధర్నా కాలంలో తమ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్మికులపక్షాన తనతో పాటు యావత్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటూ చివరి క్షణం వరకు కార్మికుల వెన్నంటి కాంగ్రెస్ పార్టీ నిలిచి హిట్లర్ పోకడలు పోతున్న కెసిఆర్ మెడలు వంచి న్యాయమైన డిమాండ్లు సాధిద్దామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఊసు బాలకృష్ణ, జటంc లక్ష్మయ్య, చిట్టెం నారాయణపేట మండల అధ్యక్షుడు, మాజీఎంపిపి సదాశివరెడ్డి, బాలరెడ్డి, సలావుద్దిన్, అచ్చుబాబు, బోయ నర్సింహులు, ఆశన్న, ఖాన్‌సాబ్, రాజు, వి.రాము, వార్డు సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

# యాదవ యుద్ధభేరిని జయప్రదం చేద్దాం..



హాజరైన యాదవులు

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 06 ప్రభాతవార్త :** బండల వెంకట్రాములు యాదవ్ అధ్యక్షతన నేడు యాదవ విద్యావంతుల వేదిక జోగులాంబ గద్వాల జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ముంచుకొస్తున్న ఈ తరుణంలో యాదవుల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వాటాకోసం ఉద్యమించాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న యాదవ సంఘాలన్నింటిని ఏకతాటిపైకి తెచ్చి మన జాతికి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమానత్వం సాధించే బాధ్యతతో యాదవ విద్యావంతుల వేదిక పోరాటం చేస్తున్నదని యాదవులు, యాదవ ఉపకులాలు తెలుగు నేలపైన 18 శాతం జనాభా ఉన్నదని గణాంకాలు చెబుతున్నాయి. కానీ జనాభా దామాషా పద్ధతిలో రాజకీయ ప్రాతినిధ్యంలో, ఆర్థిక అవకాశాల్లో, విద్య, ఉద్యోగ, సాంస్కృతిక రంగాల్లో వెనుకబడ్డాము కావున రానున్న ఎన్నికల్లో అన్నిపార్టీలు యాదవులు, యాదవ ఉపకులాలకు 22 ఎమ్మెల్యే, 7ఎమ్మెల్సీ 5ఎంపి సీట్లు ఇవ్వాలని లేనిపక్షంలో ఆయా పార్టీలను ఓడించేందుకు ప్రయత్నిస్తామని, జనగణనలో కుల గణన వెంటనే చేపట్టాలని యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రాష్ట్ర బడ్జెట్‌లో యాదవులకు 18 శాతం నిధులు కేటాయించాలని దుర్మార్గమైన ఈ డబ్ల్యుఎస్ రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలని యాదవులు, యాదవ ఉపకులాలకు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఇవ్వాలని, మొదలగు డిమాండ్ల సాధనకై సమరశీల పోరాటాలు చేసి, యాదవ జాతి అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట్‌యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అచల భారతయాదవ మహాసభ రాష్ట్రకార్యదర్శి వై.రవికుమార్ యాదవ్, విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి డా.బైకాని బాలు యాదవ్, నాయకులుయాదయ్య యాదవ్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజన్నయాదవ్, భరత్‌కుమార్‌యాదవ్, గద్వాల జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్, నాగేందర్ యాదవ్, సంజన్నయాదవ్, మహేష్ యాదవ్, అమర్ యాదవ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కమిటి అధ్యక్షులుగా శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్ యాదవ్‌లను నియమించారు.

## ప్రొ॥జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలి

**గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్**



ప్రొ॥ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 06 ప్రభాతవార్త :** ప్రొ॥జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చీర్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రొ॥జయశంకర్ చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రొ॥ జయశంకర్ 89వ జయంతి వేడుకలు పురస్కరించుకుని వారి సేవలను కొనియాడారు. తెలంగాణ ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త అని ఉద్యమ స్పూర్తి సేవలను కొనియాడారు. జయశంకర్ కలలుగన్న తెలంగాణ మనకు సిద్ధించిందని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు తుచ తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో ఏఓ భద్రప్ప, ఇంఛార్జి బిసివెల్ఫేర్ అధికారి శ్వేత ప్రియదర్శిని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవరకద్ర నియోజకవర్గంలో సమస్యలు తీర్చండి..

**సిఎం, మంత్రిలకు అసెంబ్లిలో ఎమ్మెల్యే ఆల విన్నపం**



**దేవరకద్ర, ఆగస్టు 06 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలోని పలు సమస్యలు తీర్చండని అసెంబ్లిలోని జీరోఅవర్‌లో ఆదివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్, రోడ్లు భవనాల శాఖల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిలకు విన్నవించారు. దేవరకద్ర నియోజకవర్గంలోని కౌకుంట్ల మండల కేంద్రం నుండి అడ్డాకుల మండలం ప్రధానహైవే వరకు డబుల్‌రోడ్డు మధ్యలో వాగు ఉన్నందున వాగుమీద వంతెనను మంజూరుచేయాలని ఎమ్మెల్యే ఆల కోరారు. అలాగే భూత్‌పూర్ నుంచి కర్వెన రిజర్వాయర్ వరకు డబుల్‌రోడ్డును మంజూరు చేయాలని కూడ ఆయన కోరారు. దేవరకద్ర నియోజకవర్గంలో 6గురుకులాలు ఉన్నాయన్నారు. ఇందులో 2ఎస్సీ, 2బిసి, 2మైనార్టీ గురుకులాలున్నాయన్నారు. కావున అవి అన్ని కూడ ప్రవేటు భవనాల్లో ఉన్నాయన్నారు. కావున అన్ని గురుకులాలలకు కూడ ప్రభుత్వ భవనాలు మంజూరు చేయాలన్నారు. అలాగే గ్రామపంచాయతీ భవనాలు, రైతువేదికలు ఎన్ఆర్‌జీఎస్ కింద ఎలా తీసుకొన్నామో అలాగే గ్రామాల్లో మహిళా సంఘాలకుకు సంబందించిన భవనాలు, అంగన్‌వాడీలను కూడ యూనిఫాంగా వాటిని స్వీకరించాలని ఎమ్మెల్యే ఆల అసెంబ్లిలో కోరారు. దీనికి రోడ్లు భవనాల శాఖలమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ ఆ సమస్యలన్నిటిని త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు.

## కల్వకుర్తికి చేరుకున్న విద్యార్థి సమరభేరి సైకిల్‌యాత్ర...

**- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి**

**- సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధి చేయాలి...**

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్

**కల్వకుర్తి, ఆగస్టు 06, ప్రభాతవార్త:**సమస్యల పరిష్కారం కోసం సమరభేరి సైకిల్‌యాత్ర కల్వకుర్తి పట్టణ కేంద్రానికి చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వసతి గృహ ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐనా యకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో అనేక సమస్యలతో సతమతమ వుతున్నాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు నెలల క్రితం సంక్షేమ గురుకుల వసతి గృహాలకు పెంచిన మెస్ చార్జీలు 18 రోజుల క్రితం అమలు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించిన ఇప్పటి వరకు జీవో కాపీ ఇవ్వకుండా ఏ విధంగా విధంగా మెను ప్రకారం భోజనం అందిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తక్షణమే అనుగుణంగా రూ.2500లు మెస్‌చార్జీలు పెంచాలి, సంక్షేమ వసతి గృహాల గురుకులాలు సొంత భవనాలు నిర్మించాలని, చాలా వరకు జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థలో గదుల్లో విద్యార్థులు చదువుకుంటున్న కనీసం ఈ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవకపోవడం సిగ్గుచేటుకరమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 మండలాల్లో రెగ్యులర్ ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు – మన బడి ప్రణాళికను ప్రతి ప్రభుత్వ పాఠశాలకు వర్తింపజేసి అధిక బడ్జెట్ కేటాయించాలన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, రామకృష్ణ, జిల్లా నాయకులు రవి, సుల్తాన్, నాగరాజు, వంశీ, దిలీప్, శివనాయక్, భాను, మంజు, కార్తీక్ తదితరులు ఉన్నారు.

## యాదవుల అభివృద్ధికి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి..



**అడ్డాకల్, ఆగస్టు6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని యాదవుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని, జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక అధ్యక్షులు వెంకట్ యాదవ్ అచల భారత యాదవ సంఘం మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు లక్ష్మి నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం అడ్డాకుల మండలంలో ఏర్పాటు చేసిన యాదవుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. యాదవులు విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఎదగాలని, సమాజంలో యాదవ సభ్యులను ఉన్నత స్థాయికి తీసుకువచ్చే విధంగా తోటి యాదవులు సహకరించాలని, పార్టీలకు అతీతంగా గ్రామంలో యాదవులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం అచల భారతయాదవ సంఘం అడ్డాకులమండల అధ్యక్షులుగా భీమన్న యాదవ్ , ఉపాధ్యక్షులుగా కనకయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు యాదవ్, యువజన సంఘం అధ్యక్షులుగా బలీదుపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ యాదవ్, ఉపాధ్యక్షులుగా చందు యాదవ్, తిరుపతయ్య యాదవ్ ఎన్నుకున్నారు. అడ్వకేట్ రవికుమార్ యాదవ్, భరత్ కుమార్ యాదవ్, తిరుపతయ్య యాదవ్, వేణు యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## మండల సాధన కోసం మద్దతు తెలిపిన పూర్వపు విద్యార్థులు..



**కోయిల్‌కొండ, ఆగస్టు 06 ప్రభాతవార్త :** మండలంలోని గార్లపాడు గ్రామాన్ని రెండవ మండలంగా ప్రకటించాలంటూ సాధన సమితి నేతలు గత రెండు వందల రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా 1992, 1993 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు జెఏసి నేతలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జెఏసి కో కన్వీనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మండలం ఏర్పడితే గార్లపాడుకు అన్ని వనరులు సమకూరుతాయన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి గార్లపాడును రెండవ మండలంగా ప్రకటించాలంటూ మాట్లాడడం గర్వించదగ్గ విషయం అన్నారు. గార్లపాడు ప్రజల ఆకాంక్ష నెరవేరబోతుందన్నారు. కార్యక్రమంలో విఠలాచారి, శేఖర్‌చారి, రాధాకృష్ణ, ఎస్. కృష్ణయ్య, మహేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం, మురళీకృష్ణ, కృష్ణయ్య, శివశంకర్‌గౌడ్, బాలయ్య, వీరప్ప, మన్యానాయక్, నర్సింలు, సత్యనారాయణగౌడ్, శివకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం..

**మిడ్జిల్, ఆగస్టు 06 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన తుప్పుడా బాలరాజు, మావిళ్ల జంగయ్య ఆకస్మికంగా మరణించిన విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి అంత్యక్రియల నిమిత్తం ఒక్క కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఇరు కుటుంబాలకు రూ. 10 వేలు స్థానిక సర్పంచ్ రాధిక వెంకట్‌రెడ్డి రూ.30 వేలు మొత్తం 16 వేల రూపాయలను ఇరు కుటుంబాలకు ఎంపిపి బరిగెల సుదర్శన్‌తో కలిసి ఆ కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా వెన్నంటి ఉన్నటువంటి మనసున్న నాయకుడని కొనియాడారు. ఆపదలో ఆపద్బాంధవుడుగా ఉన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధిక వెంకట్‌రెడ్డి, గోపాల్ ముదిరాజ్, కావలి ఆంజనేయులు, గంజి శేఖర్, నాగయ్య, సురేష్, సాయిబాబా, వరుణ్, జంగయ్య, వెంకటయ్య, విజయనాయక్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సీనియర్ నేత కన్నుమూత.. పలువురు నేతల నివాళి

**చిన్నచింతకుంట, ఆగస్టు 06 ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు జిల్లా బిజెపి ఉపాధ్యక్షులుగా పని చేసిన కర్దాస్ పురుషోత్తం (86) అనారోగ్యంతో కన్నుమూశారు. ఈయన జనసంఘ్‌లో పనిచేస్తూ బిజెపి బలోపేతానికి ఎంతో కృషిచేశారని బిజెపి నేతలు గుర్తు చేసుకున్నారు. బిజెపి సీనియర్ నేత మృతి చెందారని తెలుసుకుని బిజెపి రాష్ట్రనాయకులు నాగూరావునామోజీ, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డిలు పార్థీవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సిద్ధాంత పరంగా పని చేసిన నాయకుడు కర్దాస్ పురుషోత్తం అంటూ నేతలు కొని యాడారు. వీరివెంట బిజెపి జిల్లాప్రధానకార్యదర్శి నంబిరాజు, జిల్లానాయకులు సుదర్శన్‌గౌడ్, గుబ్బ శ్రీనివాస్ గుప్తా, మాసన్న, వెంకన్న, వెంకటేష్, మహేష్, వికాస్, నరసింహ, మల్లేష్, శరత్ ఉన్నారు.

## గాంధిభవన్‌లో ఎన్నికల సమావేశానికి మక్తల్ కాంగ్రెస్ నాయకులు

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 06 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధిభవన్‌లో నిర్వహించిన ఎన్నికల కో ఆర్డినేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, ఏఐసిసి సెక్రెటరీ మాణిక్‌రావుఠాక్రే, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించు విధి విధానాలపై ఎన్నికల సమన్వయకర్తలకు దిశా నిర్దేశం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మక్తల్ నియోజకవర్గం నాయకులు మర్యాదపూర్వకంగా మాణిక్‌రావు ఠాక్రేను సన్మానించడం జరిగింది. నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ విజయందిశగా పనిచేయాలని నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో నాయకులు నారాయణపేట మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మహ్మద్ నూరుద్దీన్, ఆత్మకూర్ మండల మాజీఅధ్యక్షులు మహ్మద్‌రహమతుల్లా, మక్తల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎ. రవికుమార్, నర్వ మండలం అధ్యక్షులు శరణప్ప, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుంతలి రవికుమార్, ఆత్మకూర్ మాజీ ఉపసర్పంచ్ గంగాధర్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకుడి తమ్ముడిని కలిసిన టిపిసిసి అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్

**మాగనూరు, ఆగస్టు 06 ప్రభాతవార్త :** మాగనూరు మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తమ్ముడి ఆరోగ్యాన్ని ఇటీవలే ఆపరేషన్ అయిన సందర్భంగా జరిగి ఇంటికి వచ్చిన ఆనంద్‌గౌడ్ తమ్ముడిని టిపిసిసి అధికార ప్రతినిధి గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగరాజుగౌడ్ పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.నరసింహులు, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి అయుబ్‌ఖాన్, నియోజకవర్గ యూత్ వైస్ ప్రెసిడెంట్ వేణుగౌడ్, మక్తల్ నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ కార్యదర్శి రామన్‌గౌడ్, నారాయణపేట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ్‌గౌడ్, నారాయణపేట జిల్లా పార్టీ నాయకులు నరేష్‌గౌడ్‌లు పరామర్శించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి :అదనపు కలెక్టర్ తిరుపతి రావు

**వనపర్తి టౌన్, ఆగస్టు6, ప్రభాతవార్త:** తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాటం చేసి మలి దశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతి రావు అన్నారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి వేడుకలను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఘనంగా ఏర్పాటు చేయగా అదనపు కలెక్టర్ పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రొఫెసర్ జయశంకర్ ఒక గొప్ప విద్యావేత్త అని వరంగల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా పని చేశారన్నారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో ముల్కీ ఉద్యమంలో చురుకుగా పాల్గొని మలిదశ ఉద్యమం వరకు తెలంగాణ ఉద్యమాన్ని సీజవంగా ఉంచేందుకు కృషి చేశారని కొనియాడారు. మలిదశ ఉద్యమంలో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సలహాలు సూచనలు చేస్తు ఉద్యమాన్ని తీవ్రం చేయడంలో కీలకపాత్ర పోషించారు. తెలంగాణ సాధించాక విప్లవాత్మకమైన అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ సాధించాక విప్లవాత్మకమైన అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ ఆశయాలను నిజం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అవ వారికి ఇచ్చే నిజమైన నివాళి అని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాదవ యుద్ధభేరి పోస్టర్లు విడుదల

**వనపర్తి టౌన్, ఆగస్టు6, ప్రభాతవార్త:** త్వరలో యాదవ యుద్ధభేరి పోస్టర్లను యాదవ విద్యావంతుల వేదిక నాయకులు విడుదల చేశారు. ఆదివారం జరగవలసిన సమావేశాన్ని ( మాజీ కౌన్సిలర్ బుచ్చన్న గారి అల్లుడు మోహన్ మూర్తి యాద్ చనిపోవడంతో) వాయిదా వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనాభా దామాషా పద్ధతిలో రాజకీ ప్రాతినిథ్యం, ఆర్థిక అవకాశాల్లో విద్యా, ఉద్యోగ, సాంస్కృతిక రంగాల్లో వెనుకబడ్డామని ఆయన తెలిపారు. యాదవ కార్పోరేషన్ ఏర్పాటు చేసి, రాష్ట్ర బడ్జెట్‌లో యాదవులకు 18 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా ఆకస్మికంగా మృతి చెందిన మోహన్ మూర్తి యాదవ్‌కు యాదవ సంఘం నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అచల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ యాదవ్, యాదవ విద్యావంతుల వేది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైకాని బాలు యాదవ్, నాయకులు యాదయ్య యాదవ్, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజన్న యాదవ్, భరత్ కుమార్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, గురురాజ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కమిటీ అధ్యక్షులుగా సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గురురాజ్ యాదవ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ యాదవ్‌లను నియమించారు.

## నాకు వచ్చిన అవకాశం బహుజన బిడ్డల ఆశీర్వాదమే..

**జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత సమక్షంలో పార్టీలో చేరిన ఎల్కూర్ గ్రామస్తులు**

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 06 ప్రభాతవార్త :** గద్వాల జడ్పీ ఛైర్‌పర్సన్ నివాసంలో మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ నరసింహులు 2వ వార్డు మెంబర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో ఎల్కూర్ గ్రామం నుంచి గద్వాలకు భారీ ఎత్తును 300ల మంది బిఆర్ఎస్, బిజెపి పార్టీ కార్యకర్తలతో వచ్చి కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుజన బిడ్డలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ నాకు అవకాశం ఇచ్చిందని, ఈ అవకాశం నా బహుజన బిడ్డల ఆశీర్వాదంతో గొప్ప వరంగా భావిస్తూ ఎల్లపుపడు మీ ఆశీర్వాదం ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, అమరవాయి కృష్ణారెడ్డి, గట్టు కృష్ణమూర్తి, మల్లెందొడ్డి మద్దిలేటి, అనంతపురం రాముడు, ఎల్కూర్ గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

# విద్యార్థుల హక్కులకై పోరాడుదాం:ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 06 ప్రభాతవార్త :** సమరశీల విద్యార్థి ఉద్యమాల సారథి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం, విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమాలు సాగించాలని, విద్యా వ్యవస్థను ప్రైవేటీకరిస్తున్న పాలకులకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలని రాష్ట్ర కార్యదర్శి రాజు, ఏపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం అచల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యకర్తల సమావేశం టిఎన్‌జిఓ భవన్‌లో శివ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజు, ఆంజనేయులుతో పాటు మాజీ జిల్లా నాయకులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ దేశ స్వాతంత్రం కోసం 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బెనారస్ విశ్వవిద్యాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఏఐఎస్ఎఫ్ ఏర్పడి, ఈ దేశ స్వాతంత్రం కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆవిర్భవించి ఆనాటి నుండి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు విద్యా, ప్రైవేటీకరనకు వ్యతిరేకంగా, శాస్త్రీయ విద్యా విధానంకై, విద్యా ఉపాధి హక్కుల సాధనకై నిరంతరం అవిశ్రాంతంగా పోరాటాలు సాగిస్తున్నదని తెలిపారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు విద్యను అందకుండా కార్పొరేట్ సంపన్న శక్తులను




మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విద్యను వ్యాపారంగా దారాదత్తం చేస్తూ కార్పోరేటీకరణ చేస్తున్నాయని విమర్శించారు.

దేశభక్తి సామాజిక సేవ ఉపాధి కల్పన అంశాలను, శాస్త్రీయ దృక్పథాన్ని విస్మరించి, నేడు కులం, మతం మూఢత్వం విద్వేషాల వైపు విద్యను విద్యార్థులను నడిపిస్తున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు



హాజరైన యువత

గంటా పరేష్‌బాబు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రేల్వేపాషా, ఉపేరు కృష్ణా, బంగారు మురళి, నల్లకుంట మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న తదితరులు మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివ, ప్రవీణ్, రాజవర్ధన్, వీరశేఖర్, హనుమంతు, నరెంద్ర, యశ్వంత్‌తోపాటు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండో విడత గొల్ల, కురుమల కుటుంబాలకు ఆర్థిక పరిపుష్టికే గొర్రెల పంపిణీ కార్యక్రమం

**కెటిదొడ్డి, ఆగస్టు 06 ప్రభాతవార్త :** మండల పరిధిలోని యర్సన్‌దొడ్డి గ్రామంలో గొల్ల కురుమల కుటుంబాల ఆర్థిక పరిపుష్టికే గొర్రెల పంపిణీ కార్యక్రమం అని కెటిదొడ్డి ఎంపిపి మనోహరమ్మ, జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు అన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఆదివారం కెటిదొడ్డి మండలం యర్సన్ దొడ్డి గ్రామానికి మంజూరైన 6 యూనిట్ల రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా లబ్దిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేతి వృత్తులను, కులవృత్తులను అసలు పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కులవృత్తులకు పెద్దపీట వేసి వారి ఆర్థిక అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను కుల వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. గొల్ల కురుమల కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్. ఉరుకుంద, మండల పశు వైద్యాధికారి డా. వినయ్, యర్సన్‌దొడ్డి సర్పంచ్ గోపాల్ యాదవ్, సోంపురం సర్పంచ్ తిక్కన్న, బిఆర్ఎస్ నాయకులు చక్రధర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు కురువ మల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి మనోహరమ్మ, జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు

## ఘనంగా శ్రీ బృహతి సహస్రయాగం..

**మల్దకల్, ఆగస్టు 06 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం వేదస్తోనరతాలు, మంత్రోచ్చరణల మధ్య శ్రీ బృహతి యాగాన్ని నిర్వహించారు. యాగాగ్ని లేదా పవిత్రమైన అగ్ని, ఉదయం వేద సంప్రదాయాలకు అనుగుణంగా అరణిని మథనం చేయడం ద్వారా మండించబడింది. పండితులు అరణి మంథని అనే వాయిద్యాన్ని ఉపయోగించి పవిత్రమైన అగ్నిని తయారు చేశారు. వేద స్తోత్రాలు పఠించేటప్పుడు, వారు ఒక చెక్క కొయ్యను డ్రిల్లింగ్ చేశారు. స్పిన్నింగ్ కారణంగా మెత్తటి చెక్క రంధ్రం దగ్గర నల్లటి దుమ్ము ఏర్పడింది. స్మోల్డర్‌తో ఉన్న నల్లటి దుమ్ము కొమ్మల టెండర్‌పైకి బదిలీ చేయబడింది. కొమ్మల పళ్లెం నుంచి నిప్పులు కురిపించిన వెంటనే పరిసరాలన్ని నారాయన మంత్రోచ్చరణతో మారుమ్రోగాయి. మరొక అద్భుతమైన లక్షణం శత కలశ స్థాపన 108 రాగి పాత్రలను ఏర్పాటు చేయడం, ఈ యాగం శ్రీ లక్ష్మి సమేత శ్రీమన్నారాయణుని అనుగ్రహ కోసం ఉద్దేశించబడింది. ఆలయ అర్చకులు మధుసూదనాచారి ఆధ్వర్యంలో బృహతీ సహస్రయాగాన్ని ఐజకు చెందిన గుర్రం సురేష్ ఆచారి, నరసింహమూర్తి, శ్రీనిధి ఆచారి , సుశీలేంద్రాచార్య వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం గంగాఖేడ్ వెంకటరావు కుమారుడు వరదేంద్ర ఆధ్వర్యంలో సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, రవి, దీరేంద్రదాస్, అరవిందరావు, నాగరాజుశర్మ, ధరూర్ శేషగిరిరావు, చంద్రశేఖర్‌రావు, మాజీ ఈఓ కేశవాచారి, బాబురావు, రుక్మాంగదరావు, బాదామి శ్రీనివాసులు, మనసాని నాగరాజు, ఇల్లూరు నాగరాజు, పద్మనాభయ్య, నరెందర్, నాయకి, మధు, ఉప్పరి నారాయణ భక్తులు పాల్గొన్నారు.



శ్రీ బృహతి సహస్రయాగం నిర్వహిస్తున్న దృశ్యం

## షూటింగ్ బాల్ క్రీడలు ప్రారంభం..

**ముఖ్య అతిథులుగా మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ నరసింహగౌడ్**

**మక్తల్, ఆగస్టు 06 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. శ్రీనివాసులు, సిహెచ్ ఐలయ్య ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 19 సంవత్సరాలలోపు బాల, బాలికలకు, జూనియర్ షూటింగ్‌బాల్ జిల్లాస్థాయి ఎంపికల ప్రారంభానికి ముఖ్య అతిథులుగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. నరసింహగౌడ్, జిల్లా డివైఎస్ఓ వెంకటేష్‌శెట్టి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని షూటింగ్‌బాల్ క్రీడలను ప్రారంబించారు. పి. నరసింహగౌడ్ మాట్లాడుతూ మక్తల్‌లో క్రీడలను ఎల్లప్పుడూ నిర్వహిస్తున్న విశ్రాంత పీఈటీ బి. గోపాలమును అభినందిస్తూ క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే క్రీడల వలన మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం, సమాజంలో గౌరవం, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలుపుతూ రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలని ఆయన అన్నారు. నారాయణపేట జిల్లా నుండి షూటింగ్‌బాల్ రాష్ట్రస్థాయిలో పాల్గొనసున్న రెండు జట్లకు 20మంది క్రీడాకారులకు మక్తల్ నుండి జనగామ వరకు అయ్యే ఛార్జీల ఖర్చు నేను భరిస్తానని, జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ట్రాక్ సూట్లు అందజేస్తానని తెలిపారు. జిల్లా కార్యదర్శి బి. గోపాలం, పి. నరసింహగౌడ్‌కి ధన్యవాదాలు తెలిపారు. డివైఎస్ఓ వెంకటేష్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న మక్తల్ స్టేడియాన్ని పూర్తి చేసేందుకు కలెక్టర్ సహకారంతో ముందుకు వెళ్తానని క్రీడాకారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. బి. గోపాలం మాట్లాడుతూ జిల్లాస్థాయి ఎంపికలో 60మంది బాల బాలికలు పాల్గొంటున్నారని, వీరిలో క్రీడా నైపుణ్యత ప్రదర్శించిన వారిని రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేసి, ఈనెల 20న జనగామ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడలకు పంపుతామని, వీరికి ఈనెల 10 నుండి స్టేడియంలో కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేసి వారికి మెరుగైన శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, బి.గోపాలం, పీఈటి అబ్రేష్‌కుమార్, శ్రీవాణి, దండు లక్ష్మి, హనీఫ్, గిరి, టిఆర్ఎస్ నాయకులు బిల్డర్ తాయప్ప, అశోక్‌గౌడ్, 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

## పేటలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం..

**మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు మహెందర్‌నాయక్**

**కోయిల్‌కొండ, ఆగస్టు06 ప్రభాతవార్త:** నారాయణపేట నియోజకవర్గంలో రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని నూతనంగా ఎంపికైన మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు మహెందర్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు. నూతనంగా ఎంపికైన మం డల కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు మహెందర్‌నాయక్‌ను మండల గిరిజన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు మహెందర్‌నాయక్‌ను పూల మాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నారాయణపేట ఎమ్మెల్యేగా శివకుమార్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడానికి మండల గిరిజన సంఘం, ప్రజలతో మమేకమై ముం దుకు సాగుతామ న్నారు. టిఆర్ఎస్ పార్టీ గిరిజనులకు చేసిందేమి లేదన్నారు. టిఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి గిరిజన లోకాన్ని ఏకం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికై నేటినుంచి మండల వ్యాప్తంగా ఉన్న గిరిజన తండాలలో పర్యటించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నారాయణపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రవినాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై. విద్యాసాగర్‌గౌడ్, చింతల్‌తండా సర్పంచ్ రఘునాథ్, మాజీ ఎంపిటిసి లక్ష్మణ్‌నాయక్, మాజీ సర్పంచ్ తావురియానాయక్, నాయకులు సందీప్, విఠల్, మంగ్యానాయక్, రామునాయక్, భాను, ధనరాజ్, హనుమంతు, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాల్, గోవిందునాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహెందర్‌నాయక్

## ఎస్ఐ ఫలితాలలో మెరిసిన పేదింటి కుసుమం తారక యాదవ్

**అడ్డాకల్, ఆగస్టు6, ప్రభాతవార్త:** అడ్డాకల్ మండలం బలీదుపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కారోబార్ వెంకటేష్ యాదవ్ కుమార్తె పేదింటి కుసుమం బి.తారక యాదవ్ ఆదివారం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఐ ఫలితాలలో సివిల్ కేటగిరి జోన్ 7 జోగులాంబ పరిధిలో జనరల్ కేటగిరిలో ఉద్యోగం సాధించడం జరిగింది. తాను విద్యాభ్యాసం 1వ తరగతి నుండి 4వ తరగతి వరకు నవోదయ విద్యానికేతన్, 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు శ్రీ బాలాజీ హై స్కూల్ ఇంటర్ శ్రద్ధ జూనియర్ కళాశాల, డిగ్రీ ఎంవీఎస్ మహబూబ్ నగర్‌లో చదవడం జరిగింది. రాసిన మొట్టమొదటి సారే ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి నివాళులు



**ఇటిక్యాల, ఆగస్టు 06 ప్రభాతవార్త :** ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా విషయం తెలుసుకున్న దళితసంఘం నాయకులు పుటాన్‌దొడ్డి మంద జగన్నాథం, ప్రభుదాస్, లింగరాజు, లక్ష్మన్న, మద్దిలేటి, బీచుపల్లి, శివరాజు తదితరులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదల పక్షాన గొంతుకై నిలిచిన గద్దర్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

**బాలానగర్, ఆగస్టు 06 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దరేవల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2002, 23 పదో తరగతి విద్యార్థులు గ్రామంలోని జై కన్వెన్షన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సరస్వతీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 20 ఏండ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం అందరు కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీశైలం, మధు, శ్రీనివాసులు, బస్వరాజ్, భాగ్యరాజ్, శరత్‌కుమార్, రవిందర్‌గౌడ్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, వెంకటేష్, రాజేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## జయశంకర్ సార్ ఆశయ సాధన కోసం కృషిచేద్దాం

**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘన నివాళులు**



**బాలానగర్, ఆగస్టు 06 ప్రభాతవార్త :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు ప్రొ॥ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని బాలానగర్ మండల కేంద్రంలోని వైస్ ఎంపిపి వెంకటాచారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలానగర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఆర్మీ కానిస్టేబుల్ బుచ్చన్న మృతి

**వనపర్తి టౌన్, ఆగస్టు6, ప్రభాతవార్త:** పట్టణంలోని జంగిడిపురంలో నివాసం ఉంటున్న బుచ్చన్న 32 సంవత్సరాలుగా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా హకీంపేట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అనారోగ్యం కారణంతో శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బెటాలియన్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్ విజయవర్మ, డీఎస్పీ ప్రవీణ్ కుమార్, ఏఎస్ఐ రవి, ఎస్ఐ నిమోష్,15 మంది కానిస్టేబుల్స్ , టౌన్ ఎస్ఐ యుగందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి అంత్యక్రియలు జరిపారు. ఈ కార్యక్రమంలో జాతీయవాదులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

## కావేరికి నేషనల్ ఇంటిగ్రేటెడ్ అవార్డు

**వనపర్తి టౌన్, ఆగస్టు6, ప్రభాతవార్త:** తెలంగాణ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో రామ్‌కోటి బొంగులకుంటలోఆదివారం నిర్వహించిన సృజన ఆర్ట్స్ క్రియేషన్ నేషనల్ ఇంటిగ్రేటెడ్ అవార్డు 2023 చిత్రలేఖనం అవార్డును వనపర్తి జిల్లా వాసి నానమోని మన్యం కూతురు కావేరి అందుకుంది. ఈ అవార్డు ను చీఫ్ గెస్ట్ డాక్టర్ వేణు గోపాలచారి , ఛైర్మన్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ స్పెషల్ గెస్ట్ రుద్రరాజు చేతుల మీదుగా కావేరి అందుకుంది. ఈ కార్యక్రమంలో పద్మ రాజు, ఫార్మర్ చీఫ్ ఎక్స్ ఎమ్మెల్సీ అతిథి డాక్టర్ సముద్రాల శ్రీదేవి, రైటర్ సూర్య రావులు పాల్గొన్నారు.




## మహారాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి వంశీధర్ రావును సన్మానించిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్

**వనపర్తిటౌన్ , ఆగస్టు6, ప్రభాతవార్త:** భారత రాష్ట్ర సమితి మహారాష్ట్ర ఇంచార్జిగా వంశీధర్ రావును ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించారు. ఆదివారం హైదరాబాద్ నగరంలో మహారాష్ట్ర ఇంచార్జిగా ఎన్నికైన వంశీధర్ రావును వనపర్తి బీఆర్ఎస్ పార్టీ నాయకులు మున్సిపల్ వైస్ ఛైర్మన్ , జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, గోపాల్‌పేట జడ్పీటీసీ మండల భార్గవి కోటేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో వనపర్తి మాజీ ఉపాధ్యక్షులు రవి ప్రకాష్ రెడ్డి, వంశీధర్ రావు స్నేహితులు వంశీధర్ రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీధర్ గౌరవంగా కలిసి ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంశీధర్ రావు మాట్లాడుతూ... భారతదేశంలో భారత రాష్ట్ర సమితి బలపడుతుందని మహారాష్ట్రలోని అన్ని నియోజకవర్గాల కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇందులో భాగంగా 288 నియోజకవర్గాల కన్వీనర్లను నియమించడం జరిగిందని తెలిపారు. వనపర్తి నియోజకవర్గం నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కొనియాడారు. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులు నిరంజన్‌రెడ్డిని అభివృద్ధి పథంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖను తీసుకువెళ్తున్న ఘనత నిరంజన్‌రెడ్డికి దక్కుతుందని ఆయన మంత్రి గురించి నాయకులతో కొనియాడారు.



కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న దామోదర్ రాజనర్సింహ

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**మునిపల్లి, ఆగస్టు 6, ప్రభాతవార్త:** మండలంలోని పిల్లోడి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులను ఉమ్మడి రాష్ట్ర మాజీ డిప్యూటీ సిఎం దామోదర్ రాజనర్సింహ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వానికి నూకలు చెల్లినాయన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రకటించిన డిక్లరేషన్‌తో ప్రజలు బిఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సుభిక్షానికి మాయికోడ్‌లో యజ్ఞాలు



మైకోడ్‌లో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

**మనూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** గ్రామం సుభిక్షంగా ఉండాలని వేడుకుంటూ మాయికోడ్‌లో ఆదివారం యజ్ఞ హోమాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి ఆదివారం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో యజ్ఞం నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా ఆదివారం వేద బ్రాహ్మణులు మంత్రాలు వల్లిస్తుండగా దంపుతులు పిల్లా పాపలతో కలిసి పూజలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన శ్రీశైల, శివరాజ్ దంపతులు యజ్ఞ పూజల్లో పాల్గొని భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ భక్తులు, వివేకానంద సేవా సమితి బాధ్యులు భీమన్న, బీరన్న, సంగమేశ్వర్, నారాయణ, చంద్రకాంత్, రాజ్ కుమార్, రేవన్న, కరెప్ప, సిహెచ్ సంగమేశ్వర్, అభిలేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో భక్తుల కోలాహలం



దుర్గమ్మ దర్శనానికి బారులుతీరిన భక్తులు(ఇన్‌సెట్‌లో పూజలందుకుంటున్న వనదుర్గామాత

**పాపన్నపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పిల్లలతో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలను సందడిగా మారాయి. భక్తులు తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారికి ఒడి బియ్యం, బోనాల సమర్పణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఇఓ సార శ్రీనివాస్ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజు, లక్ష్మీనారాయణ, నర్సింలు, యాదగిరి, వరుణాచారి తదితరులతో తగు సౌకర్యాలు కల్పించారు. అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ, రాముశర్మ, రాజశేఖర్‌శర్మ మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## జంగిలో కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సిఎం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**కంగ్టి, ఆగస్టు 6, ప్రభాతవార్త:** రైతుల పంట రుణాలను మాఫీ చేసిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి మండలంలోని జంగి గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు ఆదివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు రుక్మిణి బాయి అంబాజీ, గ్రామ సర్పంచ్ రాజు పాటిల్, బిఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కంగ్టిలో పాస్టర్‌ల శాంతి ర్యాలీ



కంగ్టిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్‌లు

**కంగ్టి, ఆగస్టు 6, ప్రభాతవార్త:** మణిపూర్ రాష్ట్రంలో కొనసాగుతున్న సంఘటనలను శాంతించాలని కంగ్టిలో ఆదివారం పాస్టర్‌లు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్‌లు కుమార్ రాజ్, ఏసప్ప, శేఖర్, సామేల్, బాబురావు, మనోహర్, భీమన్న, లక్ష్మణ్, సుమంత్, సాయిలు, హన్మాత్ తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు అందుకున్న జగదీశ్వర్ స్వామి

**సదాశివపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త:** జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలోని రాచణ్ణ స్వామి దేవాలయ పూజారి జగదీశ్వర్ స్వామి సువర్ణ కంకణ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం లలితాకళా ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవ సువర్ణ కంకణ అవార్డును ఆదివారం ప్రధానం చేశారు. అవార్డును అందుకున్న చంద్రశేఖర్ స్వామిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వీరశైవ సమాజం ప్రధాన కార్యదర్శి అన్మిశెట్టి జయప్రకాష్ పాల్గొన్నారు.



సువర్ణ కంకణం అవార్డును అందుకుంటున్న పూజారి జగదీశ్వర్‌స్వామి





సదాశివపేటలో జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



ఖేడ్ మైనార్టీ గురుకులంలో జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



పాపన్నపేట జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



జయశంకర్‌సార్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి



జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్





జహీరాబాద్‌లో జయంశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న ఎంపి బిబి పాటిల్

# ప్రొ. జయశంకర్ సార్‌కు ఘన నివాళులు



సంగారెడ్డిలో మాట్లాడుతున్న డిఆర్‌ఓ నగేష్

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 6, ప్రభాతవార్త:** తెలంగాణసాధనలో ప్రొఫెసర్ జయశంకర్ కృషి ఎనలేనిదని జిల్లా రెవెన్యూఅధికారి నగేష్ అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో ఆచార్య జయశంకర్ 89వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలనచేసి ఘనంగా నివా ళులర్పించారు. అనంతరం డిఆర్‌ఓ నగేష్ మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ పోరాటంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఇడి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

**చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో...**

సంగారెడ్డిలోని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ క్యాంపు కార్యలయంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్స వా లను బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతా సాయినాథ్, సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యాదర్శి నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, మసూద్, పరుశురాం పాల్గొన్నారు.

**టిఎస్‌ఆర్‌డిసి ఆధ్వర్యంలో...**

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాలను సంగారెడ్డిలోని టిఎస్ఆర్‌టిసి మెదక్ రీజియన్ కార్యాలయంలో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి రిజినల్ మేనేజర్ ఎస్.సుదర్శన్ పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యాక్రమంలో డిప్యూటి రిజినల్‌మేనేజర్ జ్యోస్న, అసిస్టెంట్ మేనేజర్ శివరామ్,కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**అందోలులో...**

**జోగిపేట, ఆగస్టు 6,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సిద్దాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం అందోలులో ఘనంగా నిర్వ హించారు. బిఆర్ఎస్ నాయకులు జోగిపేట జోగి నాథ చౌరస్తాలో ఆయన ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. విఆర్ఏల జెఏసి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ క్యాంపు కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో ఆయన కీలకంగా వ్యవహరిం చారని అన్నారు.

**సంగారెడ్డి పట్టణంలో...**

**సదాశివపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త:** సంగారెడ్డి పట్టణంలో ఆదివారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో బిఆర్ఎస్ రాష్ట్ర నేత, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ తెలంగాణ సిద్దాంత కర్త జయశంకర్ సార్ చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి మండల బిఆర్ఎస్ నాయకులు కొత్లాపూర్ శ్రీనివాస్, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు మల్లేష్ ముదిరాజ్, నాయకులు సుధాకర్, నియోజకవర్గ ఇంచార్జి పిట్టల రమేష్ ముదిరాజ్, పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు ఆర్‌కె తరుమల్, నర్సిములు, బొట్టు వెంకన్న, పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

**ఖేడ్ మైనార్టీ గురుకులంలో...**

**నారాయణఖేడ్, ఆగస్టు 6ప్రభాతవార్త:** మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మైనార్టీ పాఠశాలలో ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తారాసింగ్, రాములు, జ్యోతి, అనిత, వాజీద్, గోపాల్, వార్డెన్ ఇబ్రాహీం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రాపురం డివిజన్‌లో...**

**రామచంద్రాపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త:** తెలంగాణ సిద్దాంతకర్త, ఉద్యమస్ఫూర్తి ప్రధాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌సార్ జయంతి వేడుకలను రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఆయా డివిజన్‌లలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన జయశంకర్ చిత్రపటాలకు కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు సింధూ ఆదర్శ్‌రెడ్డి, బూరుగడ్డ పుష్పనగేష్, ప్రజలు, సొసైటీ బాధ్యులు, బల్ల నర్సింగ్, గడ్డం కుమార్, సజ్జ యాదయ్య, కుమ్మరి సత్యనారాయణ, రాణియాదవ్, ప్రీతిగౌడ్, బల్ల శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, చాకలి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**పాపన్నపేటనలో...**

**పాపన్నపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త:** తెలంగాణ సిద్దాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఆదివారం పాపన్నపేటలోని జూనియర్ కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జయశంకర్ చిత్రపటానికి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**జహీరాబాద్‌లో...**

**జహీరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** తెలంగాణ సిద్దాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. జయశంకర్ చిత్రపటానికి ఎంపి బిబి పాటిల్, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డిలు పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ తెలంగాణ సాధన కొరకు చేసిన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరోత్తం, షేఖ్ ఫరీద్, పెంటారెడ్డి, ఉమాకాంత్ పాటిల్, ఇజ్రాయిల్ బాబి తదితరులు పాల్గొన్నారు.



## మాహంకాళి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న సునీతాలక్ష్మారెడ్డి

**వెల్దుర్తి, ఆగస్టు6 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మాసాయిపేటలో మహంకాళి జాతర ఉత్సవాలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి దయతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు. నూతన మండలంగా ఏర్పడిన మాసాయిపేట ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో గ్రామంగా ఉన్న మాసాయిపేట నూతన మండలంగా ఏర్పడటం ఆనందంగా ఉందన్నారు. అందరూ ఐక్యమత్యంతో ఉండి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచి నాగరాజు, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములుగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు నర్సింలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడికి ఘనంగా సన్మానం

**శివ్వంపేట, ఆగస్టు6 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు, నర్సాపూర్ నియోజకవర్గ గౌడ సంఘం ముద్దుబిడ్డ దుర్గప్పగారి అశోక్‌గౌడ్‌ను శివ్వంపేట మండల గౌడ సంఘం అధ్యక్షులు కొడకంచి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దుర్గప్పగారి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల సంక్షేమం కోసం తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, శివ్వంపేట మండల బీసీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ఇసారపు శ్రీనివాస్‌గౌడ్, ఇసారపు రాజుగౌడ్, కొడకంచి గణేష్‌గౌడ్, కొత్తపేట రాజాగౌడ్, రాంచంద్రంగౌడ్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం



పాపన్నపేట ముదిరాజ్ యువజన సంఘం కార్యవర్గం దృశ్యం

## ముదిరాజ్ సంఘం యువజన కార్యవర్గం

**పాపన్నపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త:** మండల ముదిరాజ్ యువజన సంఘం మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పాపన్నపేటలోని మంజీరా గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో మండల కార్యవర్గాన్ని నియమించుకున్నారు. మండల అధ్యక్షులుగా కుర్తివాడకు చెందిన పుట్టి కిరణ్, ఉపాధ్యక్షులుగా బాచారం గణేష్, నీరుడి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా బాచారంకు చెందిన కర్రెల వెంకటేశం, యూసుఫ్‌పేటకు చెందిన చామంతుల కిరణ్, కార్యదర్శులుగా నరసింహులు, లక్ష్మణ్, మల్లేశం, రొడ్ద రాజు, పుట్టల మల్లేశం, నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కమిటి అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, మండల అధ్యక్షులు ముశెట్టి కిష్టయ్య పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**నర్సాపూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** నర్సాపూర్ నియోజకవర్గం నుండి సుమారు వంద మంది ఇతర పార్టీల కార్యకర్తలు టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ అల్తాఫ్ తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గం నుండి బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన వివిధ గ్రామాల యువకులు సుమారు వంద మంది శనివారం హైదరాబాద్‌లోని టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కార్యాలయంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురడం ఖాయమన్నా ధీమాను వ్యక్తం చేవారు. కార్యక్రమంలో నాయకులు సయ్యదఅల్తాఫ్, మల్లేష్,సోఫి, ముజీద్, సాదక్, మహేశ్, రమేశ్, నవీన్‌నాయక్, మోహన్‌నాయక్, ఉన్నారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

## విద్య, వైద్య అన్నదానాలతో సమాజం సుభిక్షం

### దత్త విజయానంద తీర్థస్వామీజీ

**రామచంద్రాపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త:** విద్య, వైద్య, అన్నదానాలతో సమాజం సుభిక్షంగా ఉంటుందని దత్తవిజయానంద తీర్ద స్వామీజీ అన్నారు. భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజి కాలనలో శ్రీకార్యసిద్ధి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో నెల రోజులుగా 20వ చాతుర్మాస్య వ్రతదీక్ష మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దత్తవిజయానంద తీర్ధ స్వామీజీ మాట్లాడుతూ ఆధ్యాత్మికను పెంపొందించేందుకు చాతుర్మాస్య దీక్ష మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 29వ తేదీతో మహోత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమశక్తికి అనుగుణంలో విద్య, వైద్యం అన్నదానాలు చేయాలని సూచించారు. పంచముఖి ఆలయంలో నిత్యం అన్నదానం, వైద్య దానం చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఉదయం, సాయంత్రం యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు శత చండీ యాగం, 13న విష్ణుసహస్రనామ పారాయణం చేయడం జరుగుతుందన్నారు. ప్రతినిత్యం సాయంత్రం వేళలో మార్కండేయ పురాణ ప్రవచనాలు కొనసాగుతున్నాయన్నారు. సెప్టెంబర్ 7న గణపతి సచ్చితానంద స్వామీజి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో భక్తులతో భగవద్గీత పారాయణం చేయించనున్నారన్నారు. గోమాతను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు.

## మృతుల కుటుంబానికి బిఎస్‌పి ఆర్థిక సహాయం

**ఝరాసంగం, ఆగస్టు 6, ప్రభాతవార్త:** విద్యుత్ ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన కుప్పానగర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ నాగేష్ కుటుంబాన్ని ఆదివారం బిఎస్‌పి అసెంబ్లీ ఇంచార్జి పరామర్శించి ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా సిద్దు రావణ్ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి బిఎస్‌పి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు బాబురావు, రాజు, యాదగిరి, ఆరుణ్, మోజిస్, బన్సీ, చిన్న, సుధాకర్, సంగమేష్, కృష్ణ, మారుతి, అంజన్న, తుకారం పాల్గొన్నారు.

## గుండమ్మ ఆలయంలో బోనాల పండగ

**రామచంద్రాపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కానకుంటా ఫేస్ 1 వద్ద గల గుండమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి బోనాలను ఊరేగించారు. బోనాల కార్యక్రమంలో కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సిఎం మల్లేష్, బల్ల నర్సింగ్, గడ్డం కుమార్, సజ్జ యాదయ్య, కుమ్మరి సత్యనారాయణ, కుశాంగుల దాస్, బంటు నర్సింహ,బంటు సత్యనారాయణ, రాణి యాదవ్, ప్రీతి గౌడ్, బల్ల శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, చాకలి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఫ్రెండ్ షిప్ దినోత్సవం

**సదాశివపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త:** పట్టణంలోని బంగారు మైసమ్మ ఆలయంలో ఆదివారం హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డేను ఆనందోత్సహాలతో ఘనంగా జరుపుకున్నారు. అంతకుముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ మంజీర రైతు సమాఖ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్, పూర్వ విద్యార్థులు, స్నేహితుల బృందం అధ్యక్షులు గంట శివయ్య, వీరేశం, శంకర్, రవి పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

**మనూర్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** మండలంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఎన్నికలను జరుపుకున్నారు. సంఘం మండల అధ్యక్షులుగా సతీష్ కుల్‌కర్ణి, ఉపాధ్యక్షులు నరేందర్‌రావు, రవీందర్‌రావు, ప్రధానకార్యదర్శిగా మధుసూదన్ రావు, సంయుక్త కార్యదర్శులుగా కిరణ్‌కుమార్ దేశ్‌ముఖ్, సంధ్య, కోశాధికారిగా సంతోష్ జ్యోషి, కార్యవర్గ సభ్యులుగా వెంకట్‌రావు మాలిపటేల్, దినేష్ కుల్‌కర్ణి, హరీష్‌కుల్‌కర్ణి, డిఆర్ విజయ్‌కుమార్, గుండేరావులను ఎన్నుకున్నారు.

## నాగల్‌గిద్ద ఎస్ఐగా సిద్దిరాములు

**నాగల్‌గిద్ద, ఆగస్టు 6, ప్రభాతవార్త:** నాగల్‌గిద్ద పోలీసు ఠాణా ఎస్ఐగా సిద్ది రాములు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఎస్ఐగా సేవలు అందించిన విద్యా చరణ్‌రెడ్డి బదిలీపై నారాయణఖేడ్ పోలీసు ఠాణాకు బదిలీపై వెళ్లడంతో సంగారెడ్డి టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న సిద్దిరాములు నాగల్‌గిద్దకు బదిలీ కావడంతో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

## అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

**చిన్నశంకరంపేట, ఆగస్టు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల కొరకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని ఒకేషనల్ (షార్ట్‌హాండ్) సబ్జెక్టును బోధించడానికి 2023-24 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. సంబధిత పిజి సబ్జెక్టులో 50శాతం మార్కులుండాలని, అభ్యర్థులు వారి అర్హత సర్టిఫికెట్‌లతో మెదక్‌లోని నోడల్ అధికారి కార్యాలయంలో 7నుండి 9వతేది వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్సీ సురభివాణిదేవి

**రామచంద్రాపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త:** పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి పేర్కొన్నారు. రామచంద్రాపురం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సురభి వాణిదేవి మాట్లాడుతూ బ్రాహ్మణులకు ఎలాంటి రిజర్వేషన్లు లేకపోవడంతో అనేక మంది పేదరికంలోనే మగ్గిపోతున్నారని, చిన్నారులు ఉన్నత విద్యకు దూరంగా ఉండాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని బ్రాహ్మణ సంఘం ఘనంగా సత్కరించారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు...**

శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి ఆలయలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ప్రాశ్చత సాగరికతను పక్కనపెట్టి చిన్నారులు భరటనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించగా, మరి కొందరు భగవద్గీత శ్లోకాలు చెప్పి సభికులను అలరింపచేశారు. అంతకు ముందు ఆలయంలో రుద్రాభిషేకం, మహిళలతో సామూహిక లలిత, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయదం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి రామచంద్రాపురం, అమీన్‌పూర్, పటాన్‌చెరు మండలం, పట్టణాల నుంచి పెద్ద సంఖ్యలో బ్రాహ్మణులు హాజ రయ్యారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్‌రావుదేశ్‌పాండే, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు రామారావు దేశ్‌పాండే, రామచంద్రా పురం బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



చిన్నారులకు జ్ఞాపికలను అందచేస్తున్న దృశ్యం